అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం
- ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



తోలేరులో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలో సుమారు 2.48 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా తోలేరు గ్రామంలో రూ.19 లక్షల 20 వేల నిధులతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ.23 లక్షల 94 నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే రూ.41 లక్షల 70 వేల నిధులతో నిర్మించనున్న మంచినీటి పైపులైన్ ఏర్పాటుకు, రూ.18 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అండలూరు గ్రామంలో రూ.43 లక్షల 60 వేల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మళ్లీ అవకాశమిస్తే అభివృద్ధి కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని, మరో పక్క అభివృద్ధిని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని అన్నారు. 2014లో చంద్రబాబు 600 పైగానే హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, అందుకే ప్రజలు 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు 23 సీట్లు మాత్రమే ఇచ్చారని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారుజామునే వలంటీర్లు పెన్షన్ దారులకు పెన్షన్లను అందిస్తున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ఒక మాట ఇస్తే దానిని నిలబెట్టుకునే వరకు నిద్రపోరని, కాబట్టి రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, అదే మాదిరిగా భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి రేయింబవళ్లు పనిచేస్తున్న నాకు ప్రజల అండదండలు పూర్తిగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, జేసి ఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వైసీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, చినిమిల్లి వెంకట రాయుడు, చవాకుల సత్యనారాయణ మూర్తి ,పాత గొలుసుల భోగేశ్వరరావు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, భోగిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రేణుక ,బీ సెట్టి లక్ష్మి, నాగరాజు వెంకట శ్రీనివాస రాజు, నాగరాజు పద్మ కళ, పెంటకోటి సైదేశ్వర రావు, మండపాక రాంబాబు, మేక శ్రీను, డివిడి ప్రసాద్, తంగేళ్ల బాబు ,తోటి చిట్టిబాబు , గెడ్డం భాస్కరరావు, బీశెట్టి కోటేశ్వరరావు, కర్రి రవికుమార్, దేవిరెడ్డి గోపాలకృష్ణ, వీరవల్లి శ్రీనివాసరావు, కోడి అప్పారావు , పాలమూరి బులిరాజు, ఇంటి రాఘవేంద్ర, పిల్లి నర్సింహ మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



యండగండి జూనియర్ కాలేజ్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

ఉండి: యండగండి జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం తెలుగు, సంస్కృతం, ఒకేషనల్ జనరల్ ఫౌండేషన్‌కు సంబంధించిన ఫస్ట్ ఈయర్ పరీక్షకు 179 మంది హాజరు కావలసి ఉండగా తెలుగు పరీక్షకు 20 మంది,సంస్కృతం పరీక్షకు 134 మంది,ఒకేషనల్ పరీక్షకు 16 మంది హాజరైయ్యారు. వీరిలో సంస్కృతం పరీక్షకు 9 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

నూతన ఈవోపీఆర్డీగా రామకృష్ణారెడ్డి



ఉండి: మండల నూతన ఈవోపీఆర్డీగా ఎం రామకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉండికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. ఇదే స్థానంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న కొండలరావు కపిలేశ్వరపురానికి బదిలీ అయ్యారు. అధికారులను సమన్వయం చేసుకుని విధుల నిర్వహణలో పక్షపాతానికి తావులేకుండా నడుచుకుంటానని రామకృష్ణారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

పాలకొల్లులో ప్రత్యేక ప్రార్థనా కూటమి

పాలకొల్లు అర్బన్: నీతిమంతులు దేవుని రాజ్యంలో హెచ్చింపబడతారని ప్రార్థనా శక్తి (ఉప్పలగుప్తం) పాస్టర్ చిక్కం ఇస్సాక్ అన్నారు. పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో ప్రతీ నెలా మొదటి శుక్రవారం నిర్వహించే ప్రత్యేక ప్రార్థనా శక్తి కూటమిలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పాల్గొని దేవుని ఆశీస్సులు పొందారు. పాస్టర్ ఇస్సాక్ ఉమాబాల, గోపిలు విజయం సాధించి ప్రజలకు నీతివంతమైన పాలన అందించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గూడూరి ఉమాబాల, గుడాల గోపిలు మాట్లాడుతూ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో జనామోదం పొందారన్నారు. మరో సారి అవకాశం కల్పిస్తే ప్రజలకు మరింత సేవచేసి, సంక్షేమ ఫలాలు అందిస్తారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల వెంకటరమణ, శీలం సూరిబాబు, శంకరావు శ్రీనివాసు, ఏనుగుపల్లి చంద్రశేఖర్, మడికి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువును బాధ్యతతో స్వీకరించాలి

యలమంచిలి: ప్రభుత్వ కొలువును బాధ్యతతో స్వీకరించి పనిచేస్తే ప్రజల మన్ననలు పొందవచ్చునని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. అడవిపాలెం, కొంతేరు, బాడవ, బూరుగుపల్లి గ్రామాలకు నలుగురు యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్స్ నియమితులయ్యారు. వారంతా శుక్రవారం ఎంపీడీఓ పి.శ్రీనివాసరావును కలిసి నియామకపు ఉత్తర్వులు అందజేసి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగం వచ్చిన రోజున ఎంత ఆనందంగా బాధ్యతలు స్వీకరిస్తామో? అదే ఆనందంతో ప్రతి రోజు పనిచేసి ఉద్యోగానికి న్యాయం చేయాలని కోరారు. అడవిపాలెం యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్‌గా నిల్లా కోట సత్యశ్రీ, కొంతేరు యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్‌గా షేక్ షాబీర, బాడవకు జోజిమంగుల హేమలత, బూరుగుపల్లికి అట్లూరి జిజితలు బాధ్యతలు స్వీకరించారు.

శివరాత్రి కరపత్రిక ఆవిష్కరణ

పెనుగొండ: చరిత్రాత్మక విశిష్టత ఉన్న ఆచంటలోని ఆచంటేశ్వరస్వామి మహాశివరాత్రి మహోత్సవాలు కరపత్రికను తూర్పుపాలెంలో శుక్రవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని ట్రస్ట్ బోర్డు ట్రస్టీలకు సూచించారు. భక్తుల మనోభావాలకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదపేటలో కమ్యూనిటీ భవన నిర్మాణం

సిద్ధాంతం పెదపేటలో కమ్యూనిటీ భవన నిర్మాణం సత్వరం ప్రారంభిస్తున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం సిద్ధాంతం పెదపేటకు చెందిన పెద్దలు, యువకులు మర్యాదపూర్వకంగా కలిసారు.

నేడు వార్డు ఇన్‌చార్జ్‌ల సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని 31 వార్డు ఇన్‌చార్జ్‌లు, కోర్ కమిటీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆస్తి పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2023–24 ఏడాదికి సంబంధించి ఆస్తి పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ చేసినట్లు భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఈనెలఖారు లోపు ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలు, తదితర ఆస్తి పన్నులు వార్డు సచివాలయాల్లో లేదా మున్సిపల్ కార్యాలయలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ నందు చెల్లించాలని కమిషనర్ కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: మండలంలోని ఉణుదుర్రులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13170 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఈ క్రాప్ జాబితా

పోడూరు: 2023–24 దాళ్వా సీజన్‌కు సంబంధించిన ఈ పంట జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 5 వరకూ అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పేరు, పంటరకం, విస్తీర్ణం, సాగుపద్ధతి తదితర వివరాలను సరిచూసుకోవాలనీ, అభ్యంతరాలుంటే రైతుభరోసా కేంద్రంలో దరఖాస్తు చేయాలని సూచించారు.

ప్రజల ఆరోగ్యమే రాష్ట్రానికి మహాభాగ్యం

- వెలివర్రులో జగనన్న ఆరోగ్యసురక్ష
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



వెలివర్రులో జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదవాడి జీవితానికి భరోసా లభించిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు.శుక్రవారం మండలంలోని చిలుకూరు సచివాలయ పరిధిలోని వెలివర్రు గ్రామంలో రెండవ దఫా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పెన్మత్స అంజనీదేవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సచివాలయ కన్వీనర్ ముదునూరి కొండరాజు, కళ్ళేపల్లి సతీష్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన పీవీఎల్ వైద్య సేవలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాడు- నేడుతో ఎన్నో గొప్ప సౌకర్యాలు కల్పించారన్నారు. అంతే కాకుండా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు విశేషంగా సేవలు అందజేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో రూ.5 లక్షల వరకు గల పరిమితిని రూ.25 లక్షలకు పెంచి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఇంటికే డాక్టర్ వచ్చి వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. దానికి తోడు మరో అడుగు ముందుకువేసి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అత్యంత విలువైన వైద్య సేవలను ఉచితంగా మన గ్రామంలోనే అందజేస్తున్నారని తెలిపారు. దీనిలో 14 రకాల వైద్య పరీక్షలు,100 రకాల మందులు, స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది ఈ కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నారని అన్నారు. కానీ గత ప్రభుత్వంలో చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాన్ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. నాటి ఎన్నికల్లో అధికారం కోసం 600 వాగ్దానాలు చేసిన చంద్రబాబు ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలకిచ్చిన మాటను పవిత్రంగా భావించి 99 శాతం హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశారన్నారు. ప్రజలిచ్చిన అధికారాన్ని వాడుకుని వారిని మోసగించే దుర్మార్గుడు చంద్రబాబు అయితే ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గొప్పవాడని అన్నారు. పేదవాడి సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, నీతీ నిజాయితీతో బతకాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర జానపద డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ తాటిపట్టి పెదవీరప్ప, యేడిద వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ముదునూరి వెంకటసోమరాజు, గోగులమండ చినకృష్ణమూర్తి, సూరవరపు వెంకటాచార్యులు, కమతం సౌజన్యబెనర్జీ, ఉపసర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీలు కరణం త్రిమూర్తులు, ఈది ఎడ్వర్డ్‌జాన్సన్, ముదునూరి సుబ్బరాజు, ముదునూరి చినసత్యనారాయణరాజు, మంతెన రంగరాజు, గాదిరాజు వెంకట్రాజు, గాదిరాజు శివరామరాజు, ముదునూరి భీమరాజు, ముదునూరి వీర్రాజు, గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, గలావిల్లి ధనుంజయ, కరిమెరక శివనాగరాజు,గెద్దా భోగేశ్వరరావు, బొచ్చా అచ్చారావు, జీ సుందర్‌కుమార్,వర్రే పైడియ్య, డాక్టర్ ఐ కీర్తన, కార్యదర్శి సాత్వీకం తదితరులు పాల్గొన్నారు.

నేడు రిజస్ట్రేషన్ పట్టాల పంపిణీ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం పరిధిలో నవరత్నాలు పెదలందరికి ఇళ్ల పథకంలో ఇల్లు నిర్మించుకున్న 4835 లబ్ధిదారులకు ఇంటి స్థలం రిజస్ట్రేషన్ డాక్యుమెంట్ పట్టాలను శనివారం ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, శాసన మండలి చైర్మన్ కోయ్యే మోషన్‌రాజు చేతుల మీదగా అందించనున్నారు. స్థానిక లూథరన్ గ్రౌండ్ నందు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్, హౌసింగ్ అధికారులు ఏర్పాటు చేశారు.

మావుళ్లమ్మకు బంగారు ఆభరణం సమర్పణ



దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారికి శనివారం హైదరాబాద్‌కి చెందిన ఇందుకూరి సోమరాజు విజయకుమారి దంపతులు 20 గ్రాముల బంగారు నల్లపూసల దండను సమర్పించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నించే పార్టీని ప్రశ్నించకూడదా?

పాలకొల్లు సెంట్రల్: నాడు జనసేన అంటేనే ప్రశ్నించడానికి పుట్టిన పార్టీ అని చెప్పిన పవన్ కల్యాణ్ నేడు ప్రశ్నించే వారు నాకు అవసరం లేదని అనడం చూస్తుంటే మాటమీద నిలకడలేని వ్యక్తిగా అతని తీరు ఉందని దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు యడ్ల తాతాజీ విమర్శించారు. శుక్రవారం తాతాజీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన కూటమి సభలో కనీసం పవన్ కల్యాణ్ సింగిల్‌గా పెట్టిన సమావేశానికి వచ్చిన జనం కూడా రాలేదని అన్నారు. జనసేన-టీడీపీతో కలవడం ఇష్టంలేని వ్యక్తులు కొందరైతే కలిసినా మరీ 24 సీట్లకే దిగజారిపోవడంతో జనసైనికులు జీర్ణించుకోలేకనే సభకు వెళ్లకపోవడానికి కారణంగా కనిపిస్తుందన్నారు. సభలో స్థానిక నిమ్మల రామానాయుడు రైతుల గురించి ఎంతో ప్రేమ ఒలగబోస్తున్నట్లు మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సమావేశంలో కావలి శ్రీనువాసు, గంటా నరేష్, చెన్ను విజయ్, కొరగింజల శ్రీను, రేలంగి శ్రీను, గంగాపవన్, ఉనికెల శ్రీను పాల్గొన్నారు.

వేగంగా కాటన్‌పార్క్ అభివృద్ధి పనులు



కాటన్‌పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ కాటన్‌పార్కును అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. కాటన్‌పార్కులో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసాదరాజు ఆదేశాలతో కాటన్‌పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూతపడ్డ కాటన్‌పార్కును అభివృద్ధి చేసి తెరిచామన్నారు. పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వివరించారు. పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేస్తున్నామన్నారు.


మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



కోపల్లె హైస్కూల్లో ట్రాఫిక్ ఎస్సై నాగలక్ష్మిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు

కాళ్ల: ప్రతి విద్యార్థిని పవర్ ఫుల్ మహిళగా తయారు కావాలని అప్పుడే తమను తాము రక్షించుకొని సమాజానికి ఒక ఆదర్శ మహిళగా ఎదగగలరని భీమవరం ట్రాఫిక్ పోలీస్ ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఐ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. సమాజంలో మోసపు మాటలతో విద్యార్థులను ఏ విధంగా దుర్మార్గులు మోసం చేస్తున్నారో ఎస్ఐ విద్యార్థులకు ఉదాహరణలతో వివరించారు. నేడు ప్రపంచంలో అన్ని రంగాల్లో మహిళలు విజయాలు సాధిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులను కూడా ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, డాక్టర్ పి భువనేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన మహిళాశక్తి



భీమవరంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల దృశ్యం

భీమవరం: ఆధునిక కాలంలో మహిళాశక్తి గణనీయంగా పెరిందని ఆడది అబల కాకుండా సబలగా మారిందని భీమవరం డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్, పట్టణ కళాకారుల సంఘం సహకారంతో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలను గౌరవించే ప్రాంతాలు అభివృద్ధి పథంలో ఉంటాయని ఇప్పటి వరకు ఇంటికే పరిమితమైన మహిళ నేటి సమాజంలో విద్య, వైద్య, సామాజిక, కళా రంగాల్లో ముందుంజలో ఉంటున్నారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజన్ కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు సామంత మణి మాట్లాడుతూ పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఎండీ సరోజినీ, శ్రీదేవీ, కె శిరీష, ఏ హర్షిత, బి సుష్మా, కె శ్రీవల్లి, టి తేజశ్రీ, పి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: పేద ప్రజలకు మానవత సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు అన్నారు. మానవత భీమవరం మండల శాఖకు రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ భూపతిరాజు సత్యనారాయణరాజు సమకూర్చిన అంబులెన్స్ వాహనాన్ని శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవతా సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు మాట్లాడుతూ అత్యవసరంగా సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా అంబులెన్స్ వాహనం అందుబాటులో ఉంటుందని అతి తక్కువ ధరకు రోగులను ఆస్పత్రికి తరలించడానికి ఉపయోగపడుతుందన్నారు. అంబులెన్స్ అవసరమైతే సెల్: 99899 65917 నంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, కలిదిండి గోపాలకృష్ణరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, చేకూరి జాన్సీలక్ష్మి, పాతపాటి మురళీరామ రాజు, పెన్మెత్స రామ్మోహన్‌వర్మ, సత్యనారాయణరాజు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, దాట్ల కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చినఅమిరం హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్వశిక్షాభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు

భీమవరం అర్బన్: విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తూ నాణ్యమైన విద్యతోపాటు పోషక విలువతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడమే లక్ష్యమని ఎండీఎం, సర్వశిక్షాభియాన్ జిల్లా కో -ఆర్డినేటర్ కె. కృష్ణారావు అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా కో–ఆర్డినేటర్ కె. కృష్ణారావు అకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథక పనితీరును పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద ద్వారా పోషక విలువలతో కూడిన భోజనం అందించడంతో గతంలో 45 శాతం భోజనం చేసే విద్యార్థుల సంఖ్య 88కు పెరిగిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు వి. అనురాధ, పీకేడీ రాజ్యలక్ష్మి, సీహెచ్ ప్రసాదరావు, పి. సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 1న మెకానిక్ షాపులకు సెలవు



షేక్ మోతిని సత్కరిస్తున్న మోటార్ మెకానిక్ సైకిల్ యూనియన్ నాయకులు

ఆకివీడు: నిరంతరం శ్రమిస్తూ కుటుంబాల్ని పోషించుకుంటున్న మోటార్ సైకిల్ మెకానిక్‌లకు ప్రతి నెలా ఒకటో తేదీన సెలవు ప్రకటిస్తున్నట్టు యూనియన్ తీర్మానించింది. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి షేక్ మోతిని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమించినందుకు యూనియన్ నాయకులు అయనను అభినందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మరడాని సుబ్బారావు మాట్లాడుతూ నెలకు ఒకసారి సెలవు ప్రకటించాలని సంఘ సభ్యులు కోరడంతో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు మద్దాని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎండీ. జావీద్, కోశాధికారి ఇంతియాజ్, బండారు శ్రీను, వెలగలేటి శ్రీను, షేక్ మస్తాన్, షేక్ మీరా, ఎండీ మీరాజ్, వడ్లమన్నాడ నాని, ఎస్కే. అబ్దుల్, ఎం డీ.బాజీ, బోడాల అప్పలరాజు, మనేపల్లి శివప్రసాద్, ఆదిల్, వెదురుపర్తి అప్పలాచారి, భద్రం, సంకు దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లపై చంద్రబాబు దుష్ప్రచారం



ఆచంటలో వలంటీర్లును సత్కరిస్తున్న సర్పంచ్ సరోజినీ

పెనుగొండ: పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాన్ని లబ్ధిదారులకు చేరవేస్తున్న వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు దుష్ప్రచారం చేయడం దారుణమని ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆచంటలో వలంటీర్లును సేవా మిత్ర, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరించారు. జన్మభూమి కమిటీల దోపిడిని నిరోధించడానికి వలంటీరు వ్యవస్థను సీఎం జగన్ తీసుకు వచ్చారన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలదే ఇష్టారాజ్యంగా మారుతుందన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న వలంటీర్లు ప్రజా సంక్షేమం కోసం మరింత సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.